# ముత్యం

ఆరోజు వార్తాపత్రికలో మొదటిపేజీలో పడ్డ వార్త చదివాను. 'ప్రభుత్వం ఒక శాసనాన్ని రూపొందించడానికి దృఢసంకల్పంతో ఉంది' అన్న వార్త చదివాక మా అత్తవారి పాత ఇల్లూ, ఆ కుగ్రామం జ్ఞాపకం వచ్చాయి.

పొడుగైన వాల్జడను ఎత్తయిన నా గుండెల మధ్యగా ముందుకు వేసుకొని గట్టిగా జాడించి అద్దంలో చూసుకుంటున్నాను. మునిపంటితో పట్టుకున్న చెంపపిన్ను చేత్తో అందుకుంటూ, నాలో వయసు ఒలకబోస్తున్న అందాల్ని తృప్తిగా చూసుకుంటున్నాను. అలా నాలో నేనే మురిసేవేళ అపస్వరంలా అమ్మ సణుగుడు వంటింట్లోంచి వినిపిస్తోంది. ఏముందీ, తమ్ముణ్ని అన్నింట్లోనూ వెనకేసుకు వస్తుంది. వాడి కంచం వాడికుండగా నాకు బామ్మచేయించిన కొత్త వెండి కంచంలో తింటానంటాడు. నేను కంచం దాచేసుకున్నానని వాడికి ఉక్రోషం. వయసు వస్తున్నా నాకు బుద్ధిపెరగడంలేదని అమ్మ దాడిచేస్తుంది. అవకాశం దొరికితేచాలు పదే పదే అదేమాట అంటూ వుంటుంది. అప్పట్లో నేనర్థంచేసుకున్న జీవితం అంత మాత్రమే.

"దానికి చదువుమీద అంతగా ఆసక్తి కనపడదు. మీరేమో చదివించాలంటారు. అది ఉద్యోగం చేయాలా ఊళ్లేలాలా. పెళ్లిచేసి పంపేదానికి పైచదువులు కూడా ఎందుకూ?" అని అమ్మ నాన్నగారిని విసిగించేది.

"ఉద్యోగాలు చెయ్యడానికీ ఊళ్లేలడానికేనా చదువు? జీవితాన్ని అర్థంచేసుకోవద్దూ. కనీసం వార్తాపత్రికైనా చదువుకోవద్దూ?" అని నాన్నగారి పట్టుదల.

అందుకే మూర్తి మాస్టారిని ఇంటికి పిలిపించి ట్యూషన్ పెట్టించారు. కాలేజీకి వెళ్లకపోయినా ప్రైవేటుగా అయినా బి.ఎ పరీక్ష కట్టమని బలవంతం చేశారు. అన్న ప్రాసననాడే ఆవకాయ లాగ తగిలింది నా ప్రాణానికి బెర్ట్రండ్ రస్సెల్ వ్యాసం. దాన్ని జీళ్లపాకంలా సాగదీసి మూర్తి మాష్టారు నా ప్రాణాలు తోడేసేవారు. సంకల్పం అంటూ వుంటే ఇప్పటిదాకా మనకందిన శాస్త్రజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానంతోటే కాయకష్టాన్ని తగ్గించి విశ్రాంతిని అందరికీ

పంచవచ్చునన్నాడట రస్సెల్. ఆ వ్యాసంచదివించి నోట్సు రాయిస్తూవుంటే నాకు విసుగు అనిపించి ఆవులింతలొచ్చేవి. మాష్టారు వెళ్లిపోయాక పుస్తకాలు ఓమూల పారేసేదాన్ని. నాన్నగారు పోవడంతో నా చదువుకి స్వస్తిచెప్పేశాను.ఆఘమేఘాలుగాఒక సంవత్సరమైనా తిరగకుండా నా పెళ్లి జరిపించి నన్నా కుగ్రామానికి పంపించేసింది మా అమ్మ. నాన్నగారి ఉద్యోగరీత్యా నగరవాసానికి అలవాటుపడ్డ నేను ఆ గ్రామంలో, ఆ ఉమ్మడి కుటుంబంలో ఆ పాత ఇంట్లో బ్రతుకుతూ రోజుకోమారైనా పెరట్లోని మరుగులోకి పోయే సమయంలో నా దౌర్భాగ్యానికి ఎంతో బాధపడేదాన్ని. నాన్నగారు బ్రతికుంటే ఇలాటి పరిస్థితి నాకు వచ్చేదికాదని వాపోయేదాన్ని.

ఆడపడుచు అర్ధమగడనీ, అందులోనూ చెడి పుట్టిల్లు చేరిన ఆడపడుచుతో ఇంకా బాధ అనీ మా అమ్మ పక్కింటి అమ్మలక్కలతో గుసగుసలాడుతూవుంటే విన్నాను. అందుకేనేమో ఆడపడుచంటే ఒక భయంకరమైన చిత్రాన్ని మనసులోగీసుకొని వెళ్లాను. కానీ ఆ చిత్రానికి భిన్నంగా కనుపించింది వసుధ. అప్పుడనుకున్నాను నాకు తెలియని ప్రపంచమొకటి ఉందని.

నేనెప్పుడు చూసినా ఆ పెరట్లో ఉదయంపూట తీరికలేకుండా కనుపించేది వసుధ. నా ఆలోచనలు ఆమెచుట్టూ తిరిగేవి. ఇంట్లో ఉన్న పెద్దలకే ఆ పెరట్లోని మరుగు చాలీచాలకుండా ఉంటే నాలుగేళ్లు మించని పిల్లలు సుమారుగా పదిమందికి మించి ఉండేవారు. వాళ్లంతా దూరంగా ఉన్న బాదంచెట్టు కింద కూర్చుని వంతులవారీగా వసుధ దగ్గరకు వచ్చి నిలబడేవారు.ఎంతో శాంతంగా ఒక్కొక్కళ్లనీ తన చేతులతో కడిగి బావిదగ్గిర నీళ్ళు తోడిపోసి ఇంట్లోకి పంపించేది. తను భయపడినంత భయంకరమైన ఆడపడుచు వసుధకాదని నేను చెప్పాలనుకునే లోగానే మా అమ్మ ఈ లోకాన్ని విడిచిపోయింది. మరుగు శుభ్రంచెయ్యడానికి వచ్చిన అచ్చమ్మకు తలుపుతీసి, బావిలో నీళ్లు తోడి పాత బకెట్లో పోసేది. అది శుభ్రంచేసి వెళ్లిపోయాక ఆ పెరటి తలుపు వేసేది. ఆ పని కేవలం తన బాధ్యతగా ఎందుకు ఎలా సంక్రమించిందో కానీ, నా తోటికోడళ్లు ఎవరూ చెయ్యగా చూడలేదు. నేను కాపురానికి వెళ్లాక మూడేళ్లు పిల్లాజల్లా లేకుండా గడిచిపోయాయి. ఆ తరువాతే చిన్నారి కదలికలతో వింత స్పర్శతో నా కడుపులో పడ్డాడు మా విజయ్. వాడు పుట్టాక ఒకరోజు నా గుండెల్లోకి తలదూర్చి గునగున పాలు తాగుతూ మధ్యలో నిలిపి ఉంగా ఉంగా అంటూ ఉంటే నేను మగత నిద్రలోకి జారుకున్నాను. నా పక్కలోంచి బాబుని తీసి ఎవరో ఎత్తుకున్నట్లు తోచి కళ్లు తెరిచాను. “అల్లుడేం చేస్తున్నాడో చూశావా?” అంటూ విజయ్‌ని సున్నితంగా ఎత్తిపట్టుకుని, ఒళ్లంతా శుభ్రంగా తడిగుడ్డతో తుడిచి పొత్తిళ్ల గుడ్డని మార్చి మళ్లా నా పక్కని ఎప్పటిలా పడుకోబెట్టింది వసుధ. అప్పటికికానీ నాకు

తెలిసిరాలేదు మా బాబు చేసిన ఘనకార్యమేమిటో. పచ్చని బంగారాన్ని నాకూ, నా చీరకూ పూసిపెట్టాడు. మొదటిసారిగా నాకూ వసుధకూ ఉన్న తేడాను గుర్తించాను. అమ్మ పాపం ఎంత పనిలో ఉండి సతమతమౌతున్నా నా తమ్ముడికేనాడూ కాసింత నీరైనా పోసి ఎరగను. ఆ క్షణంలో అమ్మమీద జాలివేసింది. అలా నన్ను మినహాయించుకుని చుట్టూరా ఉన్న మనుషులగురించి ఆలోచనలు నా మనసులో తిరగడం మొదలుపెట్టాయి.

ఒకనాడు పాతపడ్డవీ పనికిరానినీ చిరుగుపట్టినవీ బట్టలు నా పెట్టెలో పేరుకుపోతే విసుగేసి స్టీలు గిన్నెలవాడ్ని పిలిచి చూపిస్తున్నాను. వాటిలో ఒక గులాబీ పూల అద్దకం పరికిణీ, రంగుదారాలతో అంచులు కుట్టిన తెల్లని జాకెట్టూ వున్నాయి. వాటిని తన చేతుల్లోకి తీసుకుంటూ ఎంతో ఆసక్తిగా చూసింది వసుధ. "ఇవి చిరుగుపట్టనే లేదు. ఎవరివి వదినా?" అని అడిగింది. అంతవరకూ నాదృష్టి వాటిమీదకు పోనేలేదు. అవి నా బట్టలతో కలిసి అత్తవారింటికి వచ్చినందుకే నవ్వుకున్నాను. "నాకు పదేళ్ల ప్రాయంలో మనసుపడి కుట్టించి తొడుక్కున్న బట్టలు. ఎలాగో నా బట్టలతో కలిసిపోయి వచ్చేశాయి" అన్నాను. "వీటిని మాత్రం స్టీలు సామానుకి వెయ్యకు" నాక్కావాలి ప్రాథేయపడింది.

సరేలే అన్నానుకానీ అవి నీకుమాత్రంఎందుకూ? అని అడగబోయాను. స్టీలు గిన్నెలవాడు బట్టలను వేరువేరుగా చేసి ఏదో అంటూ వుంటే నా దృష్టి అటుగా పోయింది. నా ప్రశ్న అప్పటికి అడుగునపడిపోయింది. వసుధేమో చిన్నపిల్లలాగ ఆ పరికిణీ జాకెట్టూ తీసుకొని తుర్రున పోయింది. నాస్టీలుగిన్నెల బేరంలో ఏమాత్రం జోక్యం కలిగించుకోలేదు.

ఇలా క్రమంగా వసుధకూ నాకూ మధ్య ఏర్పడ్డ చనువుతో, ఆడపడుచన్న ఆరమరికలేకుండా తన గురించి ఎన్నో ప్రశ్నలు వేశానొక రోజు. తన అత్తవారి గురించి అడిగాను. నిర్వికారంగా ఒక యోగినిలా జవాబుచెప్పింది.

"పెళ్లయిన రెండేళ్లకే నన్ను కట్టుకున్నవాడుకాస్తా హరీ అన్నాడు. అత్తవారింట్లో వేలాడాలంటే నాదంటూ ఆస్తిలేదు. నా బతుకు నేను బతికేలా చదువైనా లేదు. అటు అత్తవారింట్లో అయినా, ఇటు పుట్టింట్లో అయినా చిన్నపిల్లల్ని సాకి చాకిరీ చేస్తే ఇంత ముద్దపడేస్తారు. అక్కడ నా తోటికోడళ్లు కనిపోస్తున్న పిల్లల్ని పెంచాలి. ఇక్కడైనా నా అన్నదమ్ముల పిల్లల్ని పెంచి పెద్దచెయ్యాలి. ఈ రెండిళ్ళూ వదిలి ఎలా ఎక్కడ బతికినా వీళ్ల గౌరవాలు మంటగలిసిపోతాయని గోల. ఇక్కడే అయితే కనీసం నా తల్లికి దగ్గరగా ఉండొచ్చునని ఆశపడ్డాను కానీ ఆవిడకూడా నన్ను వదిలి పైకిపోయింది" అని తన గాథ ముగించింది. నిష్కర్షగా నిర్లిప్తంగా చెప్పిన ఆ గొంతులో ఎంతైనా విషాదం ఉంది. ఆ మాటలు నన్ను కొత్తకోణంలోంచి తోటి ఆడదాన్ని చూడగలిగినట్లు మలిచాయి. ఆడబిడ్డలు చేసే దౌష్ట్యానికి వచ్చినంత ప్రచారం వాళ్లకు జరిగే అన్యాయంమీద రాలేదేమో అనిపించింది ఆ క్షణంలో.

ఒకనాడు మా రెండవ బావగారి చిన్నకొడుకు ఏడాది నిండనివాడు చొక్కా అంచులు చేత్తో పైకెత్తి పట్టుకుని నేనేదో పుస్తకం చదువుకుంటూ వుంటే వచ్చి నాకెదురుగా నిలబడ్డాడు. "ఇక్కడెందుకు నిలబడ్డావు? పెరట్లోకి పో..."అన్నాను. అలాగే నా ఎదుట చొక్కా తొడిగిన గోమతేశ్వరుని విగ్రహంలా నిలబడ్డాడు. చలనం లేదు. "వసుధ అత్త ఏదీ?" అని అడిగాను. వెధవాయ్‌కి నా ప్రశ్నలోని అంతరార్థం బోధపడింది.

"అత్తకి ఆయి... బబ్బుంది..." అన్నాడుచొక్కా అంచులు అలాగే ఎత్తి పట్టుకుని. "మీ అమ్మలేదూ?" అని అడిగాను. "ఆ... పోయింది" అన్నాడు. అంటే వాడికి తెలియకుండా ఎక్కడికో వెళ్లిందని వాడి భాషలో అర్థం. మా రెండో తోటికోడలికి ఇంటి పట్టున ఉండడం అంటే విసుగు. మిగతాపరివారం ఎవరెక్కడ ఉన్నారో కానీ ఈ పసివెధవని ఎవరూ అంతగా పట్టించుకున్నట్లు లేదు. వాణ్ణి ఆ క్షణంచూస్తే ఎందుకో జాలివేసి నాకు ఎన్నడూ అలవాటులేని పని మొదటిసారిగా చేశాను. "సరే... పద" అని వాణ్ణి పెరట్లోకి బావి దగ్గరికి తీసుకుపోయి కడిగి వచ్చాను. అందుకు ప్రాయశ్చిత్తంగా సబ్బుతో చేతులు పదేపదే కడుక్కున్నాను. ఆ మధ్యాహ్నం భోజనం చెయ్యలేదు. ఇంత మజ్జిగ త్రాగి నా గదిలో పడుకున్నాను.'నువ్వు భోజనం చెయ్యవూ?'అని నన్ను అడిగే వసుధ జ్వరంతో పడుకుంది. ఇక ఆ సత్రంలో ఎవరున్నదీ ఎవరు తిన్నదీ ఎవరికి పట్టింది? మావారు ఏదో కోర్టు కేసులో వకీలుతో మాట్లాడ్డానికని పట్నం వెళ్లారు. సంపాదన గురించి బాధపడకుండా అందరూ తిని కూర్చుంటున్న సంసారంలో కరిగిపోతున్న భూమిని కాసింతైనా నిలుపుకునే వ్యర్థ ప్రయత్నమది.

ఒక ఉదయం పెరటివేపు పోయి ఫురుగులోకి వెళ్లాను. ఒక్క క్షణమైనా అక్కడ నిలవబుద్ధి కాలేదు. గిరుక్కున తిరిగి వచ్చేశాను. తలారా స్నానం చేసి వచ్చి నా గదిలోకి పోయి ఏదో పుస్తకం చదువుకున్నాను. అర్థాంతరంగా నేను ఆపివేసిన చదువు ఎందుకు పూర్తిచెయ్యరాదూ? అని ప్రశ్న వేసుకుంటున్నాను. ఆరోజు ఇంటినిండా చుట్టాలున్నారు. తీర్థయాత్రలు చేసి క్షేమంగా తిరిగివచ్చిన సంతోషానికి మా పెద్దబావగారూ తోటికోడలూ వ్రతపూజ చేసుకున్నారు. రోజూ తరిమికొట్టే ఊరకుక్కను పట్టుకొచ్చి గారెల దండ మెళ్లోవేసి బొట్టుపెట్టారు. ఎందుకో అన్యమనస్కంగాఉన్నాను. నేను ఆరోజు సరిగ్గా భోజనం చెయ్యనేలేదు. వడ్డించిన విస్తరి వడ్డించినట్టే ఉంది. ఒంట్లో బాగాలేదని సర్దిచెప్పుకున్నాను.

గదిలో పడుకోబోతూ ఉండగా వసుధ వచ్చింది. "ఏం వదినా? అన్నం కాసింతైనా ముట్టలేదు..." అని నా ఆరోగ్యాన్ని గురించి పరామర్శించింది. నేను ఏమీ సమాధానం చెప్పలేకపోయాను. వసుధ మాత్రం ఊరుకోలేదు. "పెరడంతా అసహ్యంగా ఉంది. నాగా పెట్టకుండా రోజూ వచ్చిపోయే అచ్చమ్మ రెండురోజులై రాలేదు. ఎన్నడైనా అది రాలేకపోతే దాని కూతుర్ని పంపేది. అదికూడా రాలేదు. ఎందుకనో? సాయంత్రం వస్తుందేమో" అని

బాధపడింది. ఆ మాటల్లో నాకేదో సంజాయిషీ చెప్పుకుంటున్నట్లు ధ్వనించింది. ఆ ఇంటి కోడళ్ళలో పట్నవాసందాన్నీ, ఇంటరుదాకా చదువు వెలగబెట్టినదాన్నీ నేనే అవడంచేత వసుధ నన్ను ఎంతో గారాబంగా చూస్తుందనీ, నన్ను నీడలా కనిపెట్టుకుంటూ వుంటుందనీ అప్పటికే నాకో అభిప్రాయం వచ్చింది. నేను ఆ సత్రంలాంటి ఇంట్లో ఒంటరిని కాను అన్న భావన వసుధ మాటలవల్ల వచ్చి ఆ క్షణాన కాస్త తృప్తినిచ్చింది.

ఆ సాయంకాలం డాబామీద ఒక్కర్తనే అటూ ఇటూ తిరుగుతూ ఏమీ తోచక డాబామీదకి పాకిన తీగలోంచి సన్నజాజుల్ని ఏరుతున్నాను. ఎవరో పెరటివేపు తలుపు తట్టిన చప్పుడైతే అటు చూశాను. వసుధ వెళ్ళి తలుపు తీసింది. సుమారు పదేళ్ళప్రాయంలో వున్న పిల్ల లోనికి తొంగిచూసి, రావచ్చునా అని అడిగినట్లు వసుధ వేపు చూసి తలాడిస్తూ సౌంజ్ఞచేసింది. వసుధ రమ్మనగానే లోపలికి వచ్చింది. వసుధ బావిలోంచి నీళ్లుచేది పాత బకెట్‌లో పోస్తే ఆ బకెటు ఒకచేత్తోనూ, చీపురు ఇంకొక చేత్తోనూ పట్టుకుని ఆ పిల్ల మరుగులోనికి పోయింది. ఆ తర్వాత కొంతసేపటికి తట్టను మోసుకుపోతున్న ఆ అమ్మాయిని నిలిపి వసుధ ఏదో చెప్పింది. సరే అర్థమైంది అన్నట్లుగా తల ఊపుతూ వెళ్లిపోయింది.

ఆ పిల్లవెనుకనే వెళ్లి పెరటి తలుపు వేసి వస్తుందనుకున్నాను. కానీ వసుధ తలుపు వెయ్యలేదు. కానీ ఎందుకనో పెరట్లోనే అటూ ఇటూ తిరుగుతోంది. ఆరబెట్టుకున్న నా తలకు చిక్కుతీసుకుంటూ, సన్నజాజులు ఏరినవి చేత్తోపట్టుకుని క్రిందకు దిగబోతూ ఉన్నాను. పెరట్లో ఏవో మాటలు వినిపిస్తే అటుచూశాను. అదే అమ్మాయి మళ్లీ వచ్చి నిలిచింది. కానీ పోల్చుకుందుకు కొంత సమయం పట్టింది. తడితలను ఆరబెట్టుకుంటూ గులాబీ పూల అద్దకం పరికిణీ రంగుదారాలతో అంచులు కుట్టిన తెల్లని జాకెట్టు వేసుకుని పులుకడిగిన ముత్యంలా వచ్చింది. వసుధను చూసి నిర్మలంగా చిరునవ్వుతో ఏదో అంటోంది. సీతాఫలం చెట్టుకొమ్మల సందులో ఇరికించి ఉంచిన విస్తరి పొట్లాం వసుధ తీసి ఆ పిల్ల దగ్గిరగా వెళ్లింది. రెండు లేత అరచేతుల్నీ దగ్గిరగా కలిపి ఆ విస్తరి పొట్లాన్ని శ్రద్ధగా అందుకునే ప్రయత్నంలో కాసింత ఒంగి నిలుచుంది ఆ అమ్మాయి. వసుధ జాగ్రత్తగా వేసిన పొట్లాన్ని అమూల్యమైన కానుకగా అందుకుంది. వసుధ ఏమి హాస్యమాడిందో ఏమోకానీ ఆ చిన్నారి మొహంలో అందంగా చిరునవ్వు వెన్నెల విరిసింది. తలుపు వేసుకోమని చెప్పి ఆ అమ్మాయి వెళ్లిపోయింది. ఆ పాప నవ్వులోనూ, వసుధ కళ్లలోనూ సమధర్మంగా వెలిగిన ఆత్మీయత ఏదో నాలో ఉత్కంఠని రేపింది. కిందకుదిగి పెరట్లోకి వెళ్లాను. ఆ క్షణాన నా రాకను ఊహించని వసుధ- వెనుతిరిగిపోతున్న అమ్మాయిని నాకు చూపిస్తూ "అచ్చమ్మ కూతురు- దానిపేరు ముత్యాలు" అని ఒక నిముషం మౌనంగా

ఉండిపోయింది. ఆ తరువాత తేరుకుని స్వరాన్ని కాస్త తగ్గించి "నా చాకిరీ నా అన్నదమ్ముల పిల్లలకే పరిమితం. పాపం తల్లికి ఒంట్లో బాగుండని రోజున ఆ ముత్యాలు చాకిరీకి వాడవాడంతా ఎదురుచూస్తుంది" అని నిట్టూర్చింది. ఆ మాటల్లోని తాత్త్విక నైరాశ్యం ఇప్పటికీ నా చెవుల్లో రింగున వినిపిస్తూ ఉంటుంది.

చేతిలో ఉన్న వార్తా పత్రికను పక్కన పెట్టాను. ఇప్పుడు నా జీవితం ఎన్నో మలుపులు తిరిగింది. నేను నా చదువు పూర్తిచేశాను. నగరంలో మా కాపురం హాయిగానే సాగుతోంది. కానీ పత్రికలోని ఒక వార్త నన్ను ఎన్నో ఏళ్ల వెనక్కు తీసుకుపోయింది. విసర్జించిన తర్వాత వెనుతిరిగి చూడ మనసొల్లని మాలిన్యాన్ని తలకెత్తుకునే దౌర్భాగ్యం నుంచి ముత్యాలును రక్షించుకుంటే చాలు తక్కిన కాయకష్టాన్ని నియంత్రించుకోవడం మాట దేవుడెరుగు- అనుకున్నాను. బెర్ట్రండ్ రస్సల్ భాష్యం ఇప్పుడు కాస్తంత అర్ధమౌతుందని అనిపించింది. అచ్చమ్మ కూతురు ముత్యం నవ్వుతూ కనిపించింది నా మనో నేత్రానికి.